



ర్యాలీని ప్రారంభిస్తున్న జెసి డాక్టర్ నవ్య

రంజాన్ విందు.. హలీమ్ ప్రత్యేకతలు...

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

రంజాన్ మాసం సందర్భంగా కర్నూలు నగరంలో హలీమ్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నగరంలోని అనేక రెస్టారెంట్లు, స్టాల్స్ ప్రత్యేకంగా హలీమ్‌ను తయారు చేసి విక్రయిస్తున్నాయి. హలీమ్‌ను మటన్, చికెన్‌తో తయారు చేస్తున్నారు. నగర ప్రజలు హలీమ్‌ను ఎంతో ఇష్టంగా ఆరగిస్తున్నారు. హలీమ్ తయారీకి హైదరాబాద్ నుండి ప్రత్యేక చెఫ్‌లను తీసుకొస్తున్నారు. హలీమ్‌తో పాటు ఇతర రంజాన్ ప్రత్యేక వంటకాలు, స్వీట్లను కూడా విక్రయిస్తున్నారు. రంజాన్ హలీమ్‌పై ప్రత్యేక కథనం....



రంజాన్ మాసంలో ప్రత్యేకంగా లభించే హలీమ్ ఎంతో ప్రత్యేకం. హలీమ్‌ను అన్ని రకాల ప్రజలు ఎంతగానో ఇష్టపడతారు. మిగతా సమయాల్లో దొరకని హలీమ్ కర్నూలు నగరంలో రంజాన్ మాసంలో అనేకచోట్ల ప్రత్యేక స్టాల్స్ పెట్టి విక్రయిస్తుంటారు. నగర ప్రజలు వాటిని ఎంతో ఇష్టంగా ఆరగించటం విశేషం. రంజాన్ మాసంలో ముస్లిమ్ ప్రజలు భక్తి శ్రద్ధలతో ఉదయం నుండి సాయంత్రం వరకు ఉపవాసంతో నీరసంగా వుంటారు. ఉపవాసం విరమించే సాయంత్రంలో భోజనంగా హలీమ్ తీసుకుంటారు.

హలీమ్ తయారీలో వాడే పదార్థాలు : హలీమ్ అనేది పౌష్టికాహారం. గోధుమలు, మటన్, అన్ని రకాల బాదం, పిస్తా వంటి డ్రై ఫ్రూట్స్, అన్ని రకాల పప్పు, మసాలా దినుసులతో పాటు నెయ్యితో తయారు చేస్తారు.

తయారీ విధానం : హలీమ్ ఒక ప్రత్యేకమైన, రుచికరమైన వంటకం. ఇది ప్రధానంగా మధ్య ప్రాచ్యం, దక్షిణ ఆసియా, మధ్య ఆసియా ప్రాంతాలలో ప్రసిద్ధి చెందింది. హలీంలో ప్రోటీన్, ఫైబర్, ఇతర పోషకాలు ఉంటాయి. దీనిని ప్రత్యేకంగా వివిధ మసాలా దినుసులు ఎక్కువ సమయం ఉడికించటం వల్ల వస్తుంది. రంజాన్ నెలలో ప్రత్యేకంగా తయారు చేసే ఇస్లామిక్ సంస్కృతిలో ఒక ముఖ్యమైన వంటకంగా ఉంటుంది. కర్నూలు నగరంలో రంజాన్ మాసంలో ప్రముఖ హోటల్ యజమానులు హైదరాబాద్ నుండి ప్రత్యేక చెఫ్‌లను తీసుకొచ్చి హలీమ్‌ను ప్రత్యేకంగా తయారు చేసి అమ్ముతుంటారు. ఈ రంజాన్ మాసంలో దొరికే హలీమ్‌ను ముస్లిములు మాత్రమే కాకుండా అన్ని రకాల ప్రజలు ఎంతో ఇష్టంగా ఆరగించడం విశేషం. మటన్ హలీమ్‌తో పాటు చికెన్ హలీమ్ తయారు చేస్తారు.

విక్రయాలు : వీటిని 500 గ్రాముల బాక్సులలో వినియోగదారులకు విక్రయిస్తుంటారు. ఈ ఒక్కో బాక్స్ మటన్ హలీమ్ అయితే రూ.200 నుంచి రూ.250 ఉండగా చికెన్ హలీం రూ.100 నుంచి రూ.150 మధ్య లభిస్తుంది. ఫ్యామిలీ ప్యాకేజి బాక్స్‌లను విక్రయిస్తుంటారు. వీటితోపాటు అనేక రకాల స్వీట్ ఐటమ్స్ అమ్ముతుండడం విశేషం.

రంజాన్ హలీమ్ ప్రత్యేకం

- అవీజ్, తాజ్ దర్బార్ రెస్టారెంట్ యజమాని,ఆనంద్ సినీ థియేటర్ దగ్గర

రంజాన్ నెలలో హలీమ్ ప్రత్యేకం. వీటి తయారీకి ప్రత్యేక చెఫ్‌లతో హలీమ్ చేయిస్తున్నామని, మటన్, చికెన్ హలీమ్ విక్రయిస్తూనే, నగర ప్రజలకు ఇఫ్తార్ బాక్స్ పేరుతో మటన్ హలీమ్, మలయ్బన్, సమోసా లేదా దహి వడ, డ్రైఫ్రూట్స్, హైదరాబాద్ దాల్, ఖాజూర్, 4ఫ్రెష్ ఫ్రూట్స్, ఫ్రెష్ డ్రింక్ 400 ఎం ఎల్ ఇలా 11 రకాల ఐటమ్స్ కేవలం 250 రూ.లకే అందిస్తున్నామన్నారు. ఉపవాసనికి ముందు తీసుకునే సహెరి రూ.150 కిచిడి కట్ట, భీమా మటన్, చికెన్ సలాన్లను రూ.180, రూ.120 రెండు తందూరి రొటీ, మటన్కా సాలన్ లేదా చికెన్‌కా సలన్ లేదా దాలడ్కా రూ.200, రూ.150, రూ100 ప్రత్యేకంగా అందిస్తున్నాం.



హైదరాబాద్ చెఫ్స్‌తో హలీమ్ తయారీ

-నసీర్,బావార్చి (యు-కాన్ ప్లాజా) హలీమ్ ఓనర్



యూకాన్ ప్లాజా దగ్గర చికెన్, మటన్ హలీమ్ తోపాటు స్వీట్స్ వాణి కా మీఠా, గూబనికా మీఠా అమ్ముతున్నాం. ఈ యు-కాన్ ప్లాజా సెంటర్లో గత 20 సంవత్సరాలుగా హలీమ్‌ను ప్రత్యేకంగా హైదరాబాద్ నుండి చెఫ్స్‌ను పిలిపించి వండించి అమ్ముతున్నాం.

దీనిని వ్యాపారంగా చూడం

- నాసిర్ హుస్సేన్, జైయికా హలీమ్ ఓనర్



ఈ హలీమ్‌ను పిస్తా హౌస్ చెఫ్స్ ద్వారా ఆరేళ్ల నుంచి రుచికరంగా వండించి అమ్ముతున్నాం. దీన్ని బిజినెస్‌గా చూడడం లేదు. ఇది మా ఫ్యాషన్‌గా చేస్తున్నాం. మేము రంజాన్ మాసంలో మాత్రమే విక్రయిస్తుంటాం.

ఎంతకాలం అడగాలి.. ఎప్పుడు పరిష్కరిస్తారు..?

- అభివృద్ధిలో అసమానతలు-పన్నువసూళ్లలో సమానత్వం
- అధికారులను ప్రశ్నించిన పలు కాలనీల ప్రతినిధులు
- పిపిఎస్ఎస్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న పుల్లారెడ్డి

తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీల సమస్యలు పరిష్కరించాలని ఎంతకాలం అడగాలని, ఎప్పుడు పరిష్కరిస్తారని కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను వివిధ కాలనీల ప్రజలు, పట్టణ పౌరసంక్షేమ సంఘం నాయకులు ప్రశ్నించారు. ఏడాదికి 15శాతం ఇంటి పన్నులు పెంచడంలో.. చెల్లించడం ఆలస్యమైతే వడ్డీ విధించడంలో సమానతలు పాటిస్తూ అభివృద్ధిలో మాత్రం అసమానతలు జరుగుతున్నాయని అన్నారు. అభివృద్ధిలో అసమానతలను అరికట్టి పన్నులు చెల్లించే నగర ప్రజలకు కనీస సౌకర్యాలను కల్పించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, పలు కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు ఎండి. చాంద్ బాషా, ఎస్. మాణిక్య రెడ్డి, కె. వెంకట నర్సు, కమిషనర్‌ను కోరారు. సోమవారం తాగునీరు, పారిశుధ్య, రోడ్లు, కాలువల, పార్కుల సమస్యలు పరిష్కరించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ ఎదుట జరిగిన ధర్నాలో పలు కాలనీల ప్రజలు పాల్గొన్నారు. ధర్నాకు ఎన్.రమణ గౌడ్ అధ్యక్షత వహించారు. అనంతరం కమిషనర్‌కు అర్జీలు ఇచ్చారు. వారు మాట్లాడుతూ చిన్నచిన్న సమస్యలు పై నెలల తరబడి నగరపాలక సంస్థ ఆఫీసు చుట్టూ తిరిగే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సమస్యలు ఎప్పటిలోగా పరిష్కరిస్తారో చెప్పాలని కమిషనర్‌ను ప్రశ్నించారు. కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ నిర్మల్ నగర్‌లో నీటి సరఫరా సమయాన్ని ఎందుకు తగ్గిస్తున్నారో విచారణ జరపాలని ఇంజనీర్‌ను ఆదేశించారు. బి ఆర్‌రెడ్డి కాలనీ, శాంతినగర్ కాలనీ లో మురుగు కాలువల నిర్మాణం తొందర్లో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఐదు కాలనీలకు ఉపయోగపడే రిచ్మండ్ కాలనీ వంద అడుగుల రోడ్డు నిర్మాణం పరిశీలిస్తామన్నారు. బాలాజీ నగర్‌పార్కు, నీళ్ల ట్యాంకి నిర్వహణ, సుందరయ్య పార్కు నిర్మాణం, టెలికాం నగర్ పార్కు అభివృద్ధి తోపాటు పార్కుల ఆక్రమణలపై, పారిశుధ్యం మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. ధర్నా జరుగుతున్న సమయంలో కార్యాలయానికి వచ్చిన నగర మేయర్ బివై రామయ్య వాహనాన్ని నిలిపి ఆయన కూడా వినతిపత్రం ఇచ్చారు. వివిధ కాలనీల నుండి కె మధు, ఎం సాబీర్, ఎన్ పీటర్, బి ప్రభాకర్ రెడ్డి, ఎం యాకోబ్, కె.నాగరాజ్, ఎండి యూనుస్, ఎస్ మక్బుల్, జి శంకర్, కె. మోహన్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎపిపిఎస్‌సి పరీక్షలకు పకడ్బంధీగా ఏర్పాట్లు

జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎపిపిఎస్‌సి పరీక్షలు నిర్వహణకు పగడ్బంధీగా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరాదని, ఇన్విజిలేటర్లు వద్ద కూడా మొబైల్ ఉండరాదన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబడవని జాయింట్ కలెక్టర్ తెలిపారు. సమావేశంలో కలెక్టర్ కార్యాలయం ఎఒ విజయశ్రీ, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, ఎపి ఎస్‌పిడిసిఎల్ సిబ్బంది, పోలీస్‌శాఖ వారు,ఎపిపిఎస్‌సి సెక్షన్ ఆఫీసర్ డిల్లేశ్వరరావు, లైజనింగ్ ఆఫీసర్స్, ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్, సెక్షన్ ఇన్చార్జులు, తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు అవగాహన ర్యాలీ

- ర్యాలీని ప్రారంభించిన జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం సందర్భంగా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య కలెక్టరేట్ గాంధీ విగ్రహం దగ్గర ఆకుపచ్చ జెండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలి స్థానిక కలెక్టరేట్ నుండి కర్నూలు మెడికల్ కాలేజీ మీదుగా ఆసుపత్రి ప్రాంగణంలోని పాత లెక్చర్‌గ్యాలరీ వరకు కొనసాగింది. అనంతరం క్షయ వ్యాధి దినోత్సవ కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయి. ముఖ్య అతిథులుగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి, జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, ప్రాంతీయ కంటి వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పృథ్వి వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.శాంతికళ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీల సర్పంచులకు కూడా ప్రత్యేక బహుమతులను ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు. అనంతరం క్షయవ్యాధి వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలలో భాగంగా క్విజ్, వ్యాసరచన పోటీలలో పాల్గొన్న పిజి, ఎంబిబిఎస్. (యు.జి) కోర్సులలో కర్నూలు వైద్య కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు, వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న అన్ని రకాల స్థాయిలలోని సిబ్బంది అందరికి ఉత్తమ బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కుష్టు ఎయిడ్స్ అండ్ క్షయ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్, విశ్రాంత జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ పి.మోక్షేశ్వరుడు, డాక్టర్ సి. శ్రీనివాసరెడ్డి, సేవా భారతి సంస్థ అధ్యక్షులు డాక్టర్ ఎఎస్. శ్రీకాంత్, హెచ్ఒడి పల్మనాలజీ డాక్టర్ వెంకటరమణ, హెచ్‌డి గైనకాలజీ మాజీ డిటిసిఒ డాక్టర్ జి. మల్లికార్జున రెడ్డి, జిల్లా న్యూక్లియస్ వైద్యాధికారి, ప్రభుత్వ, ప్రైవేటు నర్సింగ్ కళాశాలల బృందం, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతుల ఆవేదన

- కొనుగోలుదారుల మాయాజాలం

ప్రజాశక్తి - సి. బెళగల్

సి బెళగల్ మండలంలో రైతులు విఎస్‌టి కంపెనీతో ఒప్పందం చేసుకున్నారు. ఒప్పందాన్ని విఎస్‌టి గాలికి వదిలేశారు. కొనుగోలుదారులు మకాం మార్చడంతో అమ్మకాలు నిలిచిపోయాయి. రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారు. పొగాకు రైతుల కష్టనష్టాలపై ప్రత్యేక ప్రజాశక్తి ప్రత్యేక కథనం....



సి బెళగల్ మండలంలో పొగాకు రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. విఎస్‌టి కంపెనీ ఉచితంగా విత్తనాలు ఇచ్చి, క్వింటాలు రూ.15,000 కొంటామని ఒప్పందం చేసుకుంది. దాదాపు 40 మంది రైతులు 150 ఎకరాల్లో పొగాకు సాగు చేశారు. ఎకరాకు లక్ష రూపాయల వరకు పెట్టుబడి పెట్టారు. దిగుబడి ఆశించినంత రాకపోయినా, ఒప్పందం ప్రకారం కొనుగోలు చేస్తారని ఎదురుచూశారు. కానీ, కొనుగోలుదారులు రెండు నెలలుగా వాయిదా వేస్తూ, ఇప్పుడు మకాం మార్చారు. రైతులు పండించిన పొగాకును ఎవరికీ అమ్మలేక, మూడు నెలలుగా వాముల్లో నిల్వ చేసుకున్నారు. పెట్టుబడి కూడా రాక, నష్టాల్లో కూరుకుపోయారు. కంపెనీ ప్రతినిధులు కూడా స్పందించడం లేదు. 'ఉట్టికి లేదు..స్వర్గానికి లేదు' అన్నట్టుగా తమ పరిస్థితి తయారైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎకరాకు లక్ష వరకు పెట్టుబడి పెట్టాం

- ముందరింటి శ్రీను, రైతు సి బెళగల్



ఎకరాకు అవసరమైన విత్తనాలు కంపెనీ ఉచితంగా ఇచ్చింది. గాని సాగుకు, మందులకు, కోతలకు, కూలీలకు రైతులే భరించాలి. ఎకరాకు సుమారు లక్ష వరకు పెట్టుబడి పెట్టాం. తీరా కొనుగోలు దారుల జాడ లేదు. నష్టాలు చవి చూస్తున్నాం.

మకాం మార్చిన పెంచికల పాడు వాసి

- తిరుమలేష్ రైతు సి బెళగల్



పొగాకు కొనుగోలు దారులు పెంచికలపాడు వాసి.. కంపెనీ జిల్లా ఆర్గనైజేషన్ జిల్లా అధికారి ఈశ్వర్ అనే వ్యక్తితో పరిచయం చేశారు. పంట చేతికొచ్చాక ధరలు పడిపోయాయో ఏమో గాని సమాచారం లేదు. సమాధానం లేదు.

పొగాకు రైతు పరిస్థితి దయనీయం

- సుదర్శనమయ్య రైతు సి బెళగల్



పొగాకు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. కంపెనీ కొనుగోలు దారులు కొనలేక, ఇతరులకు అమ్మలేక నిలువ చేసుకున్న పొగాకు బేళ్లు పొలాల్లో, వాము దొడ్లల్లో వృధాగా పడివున్నాయి.




ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

విచారించి న్యాయం చేస్తాం : ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు అందిన ఫిర్యాదులపై వేగంగా విచారణ చేపట్టి చట్టపరంగా న్యాయం చేస్తామని జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ తెలిపారు. కర్నూలు కొత్తపేటలోని కర్నూలు 2 టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంకు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో ఎస్‌పి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 94 ఫిర్యాదులు వచ్చాయి. వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్‌పి హామీ ఇచ్చారు. అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ హుస్సేన్ పీరా, సిఐలు పాల్గొన్నారు.



కెవి సుబ్బారెడ్డికి కేక్ తినిపిస్తున్న పి.తిక్కారెడ్డి, నాగేశ్వరరావు యాదవ్, తదితరులు

ఘనంగా కెవి సుబ్బారెడ్డి పుట్టినరోజు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కెవి సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత, టిడిపి సీనియర్ నాయకులు డాక్టర్ కె వి సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం కర్నూలు టిడిపి జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకులు కెవి.సుబ్బా రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కా రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయం, కర్నూలులో టిడిపి నాయకులు కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్, రాష్ట్ర మాదిగ ఫెడరేషన్ డైరెక్టర్ ధరూర్ జేమ్స్, పి.హనుమంతరావు చౌదరి, బేతం క్రిష్ణుడు, మంచాలకట్ట భాస్కర్ రెడ్డి, రెడ్డిపోగు బజారన్న, పేరపోగురాజు, పుల్లయ్య, ఈరన్న, మంజునాథ్ మొదలగు వారితో పాటు పలువురు కార్యకర్తలు కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షేమ హాస్టళ్ల సమస్యలు పట్టవా?

-అధికారుల ఇష్టా రాజ్యానికి విద్యార్థులు బలి పశువులు
-ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి-కోడుమూరు రూరల్

దళిత గిరిజన బడుగు బలహీన వర్గాల పేదల పిల్లల చదువులంటే అధికారులకు అలుసుగా మారిందని, జిల్లా అధికారులకు సాంఘిక సంక్షేమ హాస్టల్లో సమస్యలు పట్టడం లేదని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు బి.కరుణాకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు అబూబకర్ విమర్శించారు. కోడుమూరు పట్టణంలోని ఎస్‌సి సంక్షేమ బాలుర వసతీ గృహాన్ని సోమవారం సందర్శించి విద్యార్థులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆదివారం రాత్రి బస్టాండ్ సమీపంలో దుకాణం దగ్గర ఏదో జరిగిందని బయట వ్యక్తులు హాస్టల్ దగ్గరికి వచ్చి ఫిర్యాదు చేయడంతో, విచక్షణ కోల్పోయిన సీనియర్ విద్యార్థి జూనియర్ విద్యార్థులపై బెల్టుతో దాడి చేయడం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిందన్నారు. సీనియర్ విద్యార్థి దాడి చేయడం హేయమైనా చర్య అయినప్పటికీ, దానికి అసలైన కారణం అక్కడున్న సిబ్బందిదే అన్నారు. ఊరికి చివరన ముళ్ళ కంపల పక్కన ఉన్న ఎస్సీ హాస్టల్లో విద్యార్థులను చూసుకునేందుకు రాత్రి ఒక్కరూ లేకపోవడమే ప్రధాన కారణమన్నారు. హాస్టల్ వార్డెన్ ఇన్చార్జిగా ఉండడం కారణంగా, ఇక్కడ వెళితే అక్కడ, అక్కడికి వెళ్తే ఇక్కడ అని తప్పించుకునే ప్రయత్నాలు సాధారణంగానే ఉంటాయన్నారు. వాచ్మెన్, కామాటి , కనీసం కుక్క కూడా రాత్రిపూట ఒక్కరు లేకపోవడం వల్లనే ఇలాంటి ఘటనలకు అవకాశం ఏర్పడిందన్నారు. ఇంతే కాకుండా హాస్టల్ చుట్టుపక్కల నిరంతరం అసాంఘిక కార్యక్రమాలకు నిలయమై విద్యార్థులను భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. హాస్టల్ వార్డెన్‌తో పాటు వర్కర్లను సస్పెండ్ చేయాలని, పర్యవేక్షణ చేయని అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టల్ సమస్యలను పరిష్కరించి, పేదల విద్యకు తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఖాజావలి, పృథ్వి పాల్గొన్నారు.



హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్ నాయకులు

కోడుమూరు హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

కర్నూలు కలెక్టరేట్ : కోడుమూరు సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్ వార్డెన్ జి.రాముడు ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు. హాస్టల్ ఈనెల 11న హాస్టల్ లో ఉంటున్న పదవ తరగతి విద్యార్థి మహేష్ 7వ తరగతి విద్యార్థి పి. రాజు, 8వ తరగతి విద్యార్థి జె.ఇసాక్‌లపై భౌతికంగా దాడికి పాల్పడినట్లు వెల్లడించారు. ఈ ఘటన ఈనెల 11న జరిగినప్పటికీ పై అధికారుల దృష్టికి తీసుకురాకపోవడంతో పాటు వసతి గృహ నిర్వహణ లో సరైన పర్యవేక్షణ చేయకుండా విధి నిర్వహణ లో నిర్లక్ష్యం వహించిన కారణంగా వసతి గృహ సంక్షేమ అధికారి జి.రాముడును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

దర్యాప్తు చేస్తున్నాం కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు




వీడియో వైరల్ అయిన వెంటనే హాస్టల్‌కు వెళ్లి పిల్లల తల్లిదండ్రులని పిలిచి కేసు నమోదు చేశాం. దర్యాప్తులో భాగంగా టెన్త్ క్లాస్ విద్యార్థి మహేష్ కొట్టారని విచారణలో తెలిసింది. అతన్ని అదుపులోకి తీసుకున్నాం. దర్యాప్తు జరుగుతోంది. తదుపరి చర్యలు తీసుకుంటాం.

హంద్రీనీవా ప్రాజెక్టు పెండింగ్ పనులను పూర్తి చేయాలి

ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘాలు

ప్రజాశక్తి-పత్తికొండ : హంద్రీనీవా ప్రాజెక్టు పెండింగ్ పనులను పూర్తిచేసి 61,400 ఎకరాలకు సాగునీరు అందించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జ దశరథ రామిరెడ్డి, ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.రాజాసాహెబ్‌లు డిమాండ్ చేశారు. సోమవారం పందికోన రిజర్వాయర్ ఆయకట్టు సాధన సమితి ఆధ్వర్యంలో రైతు సంఘాల నాయకులు ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లా డుతూ హంద్రీనీవా ప్రాజెక్టు రిజర్వాయర్ ద్వారా 61400 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా, కేవలం 12 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతుందన్నారు. పందికోన రిజర్వాయర్ కింద ఉన్న కుడి, ఎడమ కాలువలను పూర్తి చేసి సాగు, తాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. పెండింగులో ఉన్న ప్రాజెక్టులకు రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయించకుండా రైతాంగాన్ని తీవ్ర నిరాశకు గురి చేశారన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి రాష్ట్ర ప్రభుత్వం రూ.250 కోట్లు నిధులు కేటాయించి 1 లక్ష ఎకరాలకు సాగునీరు ఇవ్వాలన్నారు. కృష్ణానది నీటి యాజమాన్య బోర్డ్ కర్నూలులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డిఒ ఆఫీసులో వినతి పత్రం అందజేశారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయ కులు శేషాద్రి రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో రైతు సంఘాల నాయకులు ఆది నారాయణ రెడ్డి, తిమ్మయ్య, సురేంద్ర కు మార్, కారన్న, సుల్తాన్, పెద్ద ఈరన్న, కారు మంచి, తెర్నేకల్, కైరుప్పల సర్పంచులు అరుణ్, వీరభద్రప్ప, కాశీ విశ్వనాథ్, రామకృష్ణారెడ్డి, శివారెడ్డి, వేణుగోపాల్ ప్రగతిశీల మహిళా అధ్యక్షురాలు మన్నెమ్మ, రైతు నాయకులు పాల్గొన్నారు.



ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘాలు



కార్మికులకు పరిహారం అందజేస్తున్న మిల్ యజమాని, సిఐటియు నాయకులు

సిఐటియు కృషితో రైస్‌మిల్ కార్మికులకు నష్టపరిహారం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూల్ నగరంలోని రామ చంద్రయ్య (టోపీ రామయ్య) రైస్ మిల్‌లో పనిచేస్తున్న కార్మికులకు సిఐటియు చొరవతో 24 మందికి రూ.13 లక్షల నష్టపరిహారం ఇప్పించామని ఆయిల్ అండ్ రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గౌస్‌దేశాయ్ తెలిపారు. ఇటీవల ఆయిల్‌అండ్ రైస్ మిల్‌లో పనులు నిలిపి వేశారు. సోమవారం కర్నూలు సుందరయ్య భవన్లో మిల్లు యాజమాన్యం పరమేశయ్యతో చర్చలు జరిపి 24 మంది కార్మికులకు ఒక్కొక్కరికి రూ.52 వేల చొప్పున ఆ మిల్లులో పనిచేసినందుకు గాను నష్టపరిహారం ఇప్పించామని తెలిపారు. గౌస్‌దేశాయి మాట్లాడుతూ కార్మికులు ఇన్ని రోజులు మిల్లు పనిచేసినందుకు యాజమాన్యంతో చర్చించి రూ.52 వేల ఇచ్చేలాగా అంగీకరించిన యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. కార్మికులకు వచ్చిన ఈ డబ్బులను తమ కుటుంబాల కోసం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ అండ్ రైస్ మిల్ యూనియన్ జనరల్ సెక్రెటరీ సాయిబాబా, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, మిల్లు మేస్త్రి మోసన్న, మిల్లు యజమాని పరమేశయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐఎస్‌కెఒ పరీక్షలో 'నారాయణ' ప్రతిభ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కౌన్సిల్ ఫర్ న్యూట్రింగ్ అకాడమిక్ పొటెన్షియల్ ఇన్ స్టూడెంట్ సంస్థ నిర్వహించిన ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ నాలెడ్జ్ ఆర్గనైజేషన్ (ఐఎస్‌కెఒ) పరీక్షలో నారాయణ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సోమవారం మాధవ నగర్ లోని ఆ పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపల్ మహమ్మద్ అల్తాఫ్ వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఆల్ ఇండియా స్థాయిలో చాకలి అరవింద్(3ర్యాంకు), దూదేకుల సాదియా(15), కుశ్వంత్(18), అభయ్ రామ్(23) ర్యాంకులు కైవసం చేసుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు. అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు సంస్థ మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేస్తారన్నారు. ఈ చాంప్స్ వైస్ ప్రిన్సిపల్ నాగేశ్వరి పాల్గొన్నారు.



ఎలాంటి ఇబ్బందులూ లేవు : డిఇఒ

ప్రజాశక్తి - హోళగుంద


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఇఒ

పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు అన్ని సౌకర్యాలూ కల్పించామని, ఎలాంటి ఇబ్బందులూ లేవని డిఇఒ శ్యామూల్ పాల్ తెలిపారు. సోమవారం గణితం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. డిఇఒ శ్యామూల్ పాల్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పరీక్ష కేంద్రాల్లో ఏదైనా ఇబ్బంది తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎ కేంద్రంలో 208 మంది విద్యార్థులకుగానూ 199 మంది పరీక్షలు రాసినట్లు చెప్పారు. బి కేంద్రంలో 214 మందికి గానూ 199 మంది హాజరైనట్లు తెలిపారు. ఎంఇఒలో సత్యనారాయణ, జగన్నాథం ఉన్నారు.

వాడీవేడిగా ఉపాధి సామాజిక తనిఖీ


ఎండలోనే గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని మాచాపురం, సోమలగూడూరు గ్రామాల్లో సోమవారం ఉపాధి సామాజిక తనిఖీ గ్రామసభలు వాడీవేడిగా సాగాయి. మాచాపురం గ్రామంలో అధికారులు ఎండలోనే గ్రామసభ నిర్వహించారు. గ్రామసభను ఎండలో నిర్వహించడం వల్ల ప్రజలు వ్యతిరేకించారు. గ్రామ అధికారులు, ఉపాధి హామీ అధికారుల మధ్య తీవ్ర స్థాయిలో వాదోపవాదాలు జరిగాయి. నిర్వహణ బాధ్యత తనకు సంబంధం లేదంటూ గ్రామ అధికారులు, తమకు సంబంధం లేదంటూ ఉపాధి అధికారులు విమర్శలు చేసుకున్నారు. సంవత్సర కాలంలో జరిగిన ఉపాధి హామీ పనుల వివరాలు, వాటి బడ్జెట్‌ను డిఆర్‌పి ఎం.శివ చదివి వినిపించారు. పంచాయతీ కార్యదర్శి పెద్ద రెడ్డి, టిడిపి నాయకులు కోటేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ గోపాల్ పాల్గొన్నారు. సోమల గూడూరులో గ్రామసభ వాడీవేడిగా సాగింది. తమకు జాబ్‌కార్డు ఇస్తానని డబ్బులు వసూలు చేశారని, జాబ్ కార్డు ఇవ్వలేదని ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణపై బాధితులు ఫిర్యాదు చేశారు. విధుల నుంచి తొలగించాలని తనపై ఆరోపణలు చేస్తున్నారని ఫీల్డ్ అసిస్టెంట్ తెలిపారు. తనపై అధికారులు కూడా కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఎపిఒ శ్రీనివాసులు, ఈసీ నూర్జహాన్, డిఆర్‌పి సుబ్రహ్మణ్యం, టిడిపి నాయకులు వెంకటరామిరెడ్డి, పార్థసారథి రెడ్డి, గోపాల్ రెడ్డి, చంద్రశేఖర్, వైసిపి నాయకులు వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

విద్యామఠంగా గుర్తింపు

- రూ.లక్ష ప్రోత్సాహంతో విద్యార్థులకు సన్మానం

- శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు

ప్రజాశక్తి - మంత్రాలయం


విద్యార్థులకు జ్ఞాపిక అందజేస్తున్న పీఠాధిపతులు

మంత్రాలయం శ్రీరాఘవేంద్ర స్వామి మఠానికి విద్యామఠంగా గుర్తింపు ఉందని శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు పేర్కొన్నారు. గత రెండు రోజులుగా జరుగుతున్న శ్రీమద్ న్యాయ సుధా మంగళ మహోత్సవంలో సంస్కృత భాషలో శ్రీమన్ న్యాయ సుధా గ్రంథం గురించి నిర్వహించిన పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపిన 8 మంది విద్యార్థులకు సోమవారం రూ.లక్ష చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందించి, సర్టిఫికెట్లు, జ్ఞాపిక అందజేసి ఆశీర్వదించారు. అంతకుముందు ఏర్పాటు చేసిన వేదికపై శ్రీమన్ న్యాయసుధా విద్యార్థుల అనువాదం చేపట్టారు. పండితులు పీఠాధిపతుల సమక్షంలో ఇష్టా గోష్ఠి నిర్వహించారు. వ్యాసరాజ మఠం పీఠాధిపతులు శ్రీవిద్యాశ్రీ తీర్థులు, శ్రీపాదరాజ మఠం పీఠాధిపతులు శ్రీసుజయనిధి తీర్థులు, పేజావర మఠం పీఠాధిపతులు శ్రీవిశ్వప్రసన్న తీర్థులు, పీఠాధిపతులు శ్రీవిద్యాదీశ తీర్థులు, సుడే వాదిరాజ మఠం పీఠాధిపతులు శ్రీవిశ్వవల్లభ తీర్థులు, భీమనకట్టే మఠం పీఠాధిపతులు శ్రీరఘువరేంద్ర తీర్థులు, తంబిహళ్లి మఠం పీఠాధిపతులు శ్రీవిద్యాసాగర మాధవ తీర్థులు, రామోహళ్లి మఠం పీఠాధిపతులు శ్రీవిశ్వభూషణ తీర్థులు, సుబ్రమణ్య మఠం పీఠాధిపతులు శ్రీవిద్యాప్రసన్న తీర్థులు, కణ్వ మఠం పీఠాధిపతులు శ్రీవిద్యాకాన్వ విరాజ తీర్థులు, బాలగారు మఠం పీఠాధిపతులు శ్రీఅక్షోభ్య రామప్రియ తీర్థులు, ఉడిపి మఠం పీఠాధిపతులు శ్రీబన్నంజే రాఘవేంద్ర తీర్థులు, శ్రీవామన తీర్థులు, పీఠాధిపతుల పూర్వాశ్రమ తండ్రి రాజా ఎస్.గిరియాచార్యులు, రాజా ఎస్.అప్రమేయచార్ పాల్గొన్నారు.

ఉపాధి కూలిలు చెల్లించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు

- సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని, మండలంలో తాగునీరు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఒకే ప్రభుత్వం ఉన్నప్పటికీ పథకాలు అమలు చేయడంలో నిర్లక్ష్యంగా ఉన్నారని విమర్శించారు. కేంద్రంలోని ప్రభుత్వంతో నిధులు సాధించి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదోని ప్రాంత అభివృద్ధి కోసం ఎమ్మెల్యే చొరవ తీసుకొని కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.1000 కోట్ల నిధులు సాధించాలని తెలిపారు. అసెంబ్లీలో మాట్లాడినంత మాత్రాన సమస్యలు పరిష్కారం కావని, నిధులు కేటాయించే వరకు పోరాటం చేయాలని సూచించారు. సిపిఎం మండల కార్యదర్శి లింగన్న మాట్లాడుతూ... మండలంలో నెమలికల్ స్కీం నుంచి బసరుకోడు వరకు అదనపు పైపులైన్ వేసి రెండు రోజులకోసారి తాగునీరు అందించాలని కోరారు. కుప్పగల్ ఎస్ఎస్ ట్యాంకు నుంచి పాండవగల్లు వరకు అదనపు పైపులైన్ వేయాలని, ఫిల్టర్ బెడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెద్ద తుంబలం ఎస్ఎస్ ట్యాంకును వెడల్పు చేయాలని కోరారు. తాగునీరు సరఫరా కాకపోతే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసి నీటి కొరత తీర్చాలని డిమాండ్ చేశారు. మండలంలో బైచిగిరి క్రాస్ నుంచి కపటి వరకు, ఢణాపురం నుంచి హోళగుంద వరకు రోడ్డు బాగు చేయాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి వర్గసభ్యులు వీరారెడ్డి, రామాంజనేయులు, ఉచ్చీరప్ప, రామాంజనేయులు, మండల కమిటీ సభ్యులు బాష, అయ్యప్ప, పాండురంగ, హనుమంతు రెడ్డి, మునిస్వామి, శాఖ కార్యదర్శులు గోవిందు, కర్ణ, రామాంజనేయులు, తాయప్ప, నాగరాజు పాల్గొన్నారు.


ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సిపిఎం ధర్నా

మంత్రాలయం తహశీల్దార్ ఎదుట సిపిఎం మండల కార్యదర్శి హెచ్.జయరాజు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తహశీల్దార్ ఎస్.రవికి వినతిపత్రం అందజేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎమ్‌డి.అంజిబాబు మాట్లాడుతూ... ఇల్లు లేని ప్రతి పేదవాడికి మూడు సెంట్లు స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. మండలంలో నెలకొన్న డ్రైయినేజీ, రోడ్ల సమస్యలను పరిష్కరించాలని, తాగునీటి కొరతను దృష్టిలో ఉంచుకొని అవసరమైన చోట కొత్త పైపులైన్ ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రాలయం నుంచి కల్లుదేవకుంట, చిలకలదోన గ్రామాలకు వేసిన పాత ఎస్‌పి పైపులైన్ తొలగించి కొత్త పైపులైన్ వేయాలని తెలిపారు. స్థానికంగా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును ఏర్పాటు చేయాలన్నారు. మంత్రాలయంలో కనీసం వంద పడకల ఆస్పత్రి లేకపోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. అంతకుముందు ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి రాఘవేంద్ర సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. పెద్దకడబూరు మండల కార్యదర్శి తిక్కన్న, కార్యకర్తలు లక్ష్మన్న, అనిల్, ప్రాణేష్, అంజి, మారెప్ప, సురేష్, వీరేష్, దావీదు పాల్గొన్నారు.



మంత్రాలయంలో సిపిఎం ధర్నా

'బార్' జనరల్ సెక్రటరీగా షాకీర్ ఏకగ్రీవం

-సన్మానించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- ఆలూరు

ఆలూరు బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా షాకీర్ బాష ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఆలూరు జ్యోతి బసు భవన్‌లో సిపిఎం ఆధ్వర్యంలో షాకీర్ బాషకు నాయకులు శాలువా, పూలమాల వేసి సన్మానించారు. ఈ సందర్భంగా సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు, సీనియర్ నాయకులు కెపి.నారాయణ స్వామి మాట్లాడారు. ఆలూరు బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా షాకీర్ ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన న్యాయవాదులందరికీ ధన్యవాదాలు తెలిపారు. న్యాయవాది షాకీర్ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి విద్యార్థి సంఘంలో, నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి యువజన సంఘంలో, కార్మికుల సమస్యల పరిష్కారానికి కార్మిక సంఘంలో, సిపిఎంలో పని చేశారని చెప్పారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సిపిఎం నాయకులు కృష్ణ, ఈరన్న, నాగరాజు, వీరేష్, విఠల్, డివైఎఫ్ఐ నాయకులు మైనా, వెంకటేష్, ఐద్వా నాయకులు షేకున్ బీ, గౌసియా బీ, తాయప్ప, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** బార్ అసోసియేషన్ అధ్యక్షులు న్యాయవాది పి.రసీదుల్లా, కార్యదర్శిగా ఎస్.ఆనంద్, ఉపాధ్యక్షులుగా పి.నాగన్న, సహాయ కార్యదర్శిగా ఎం.హిజ్కియా, లైబ్రరీ సెక్రటరీగా కె.వెంకన్న, ఆర్థిక కార్యదర్శిగా కె.మురళీకృష్ణ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా వి.రామకృష్ణ నాయుడు ఎన్నికయ్యారు. న్యాయవాదుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని, ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి ద్వారా కొత్త కోర్టుల ప్రతిపాదనలు కార్యరూపం దాల్చడానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది. కొత్త కార్యవర్గం ఎంపిక కావడం పట్ల న్యాయవాది మహబూబ్ బాషా హర్షం వ్యక్తం చేశారు.


ఎమ్మిగనూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



ఆలూరులో షాకీర్ బాషను సన్మానిస్తున్న నాయకులు

ఎన్‌క్వాసిలో చిప్పగిరి మొదటి స్థానం

ప్రజాశక్తి - చిప్పగిరి

నేషనల్ క్వాలిటీ సర్టిఫికేషన్‌లో భాగంగా పబ్లిక్ హెల్త్ ఫెసిలిటీస్‌లో ఉత్తమ సేవలకు గాను ప్రభుత్వం ప్రకటించిన రెండు ఆస్పత్రుల్లో చిప్పగిరి ప్రభుత్వాస్పత్రి ప్రథమ స్థానంలో నిలిచింది. అందుకు కృషి చేసిన ప్రభుత్వ డాక్టర్ అప్రోజ్ జహాన్ డిఎంహెచ్ఒ డాక్టర్ శశికళ చేతుల మీదుగా ఉత్తమ ప్రశంసా పత్రం అందుకున్నారు. ప్రభుత్వం ఆస్పత్రి సేవలను గుర్తించి ఉత్తమ అవార్డు ఇవ్వడం ఆనందంగా ఉందని ఆమె తెలిపారు. డాక్టర్ అప్రోజ్ జహాన్‌కు ప్రజాప్రతినిధులు, తోటి సిబ్బంది సోమవారం అభినందనలు తెలిపారు.


ప్రశంసా పత్రం అందుకుంటున్న డాక్టర్ అప్రోజ్ జహాన్

26న తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా


- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఆనంద్ బాబు

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఈనెల 26న తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎమ్‌డి.ఆనంద్‌బాబు తెలిపారు. స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం గోనెగండ్లలో కరపత్రాలు పంచుతూ ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. సిపిఎం శాఖ కార్యదర్శి బి.కరుణాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ బాబు మాట్లాడారు. పేదలకు 3 సెంట్ల స్థలం ఇవ్వాలని, స్థానిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 26న జరిగే ధర్నాలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం నాయకులు నబీ రసూల్, మునెప్ప, బతకన్న, దేవదాసు, లింగన్న పాల్గొన్నారు.


గోనెగండ్లలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

హాలహర్వి : మండలంలోని చింతకుంట గ్రామంలో సిసి రోడ్లు, డ్రైయినేజీ నిర్మాణం చేపట్టాలని సిపిఎం నాయకులు కోరారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా హాలహర్వి మండలంలోని చింతకుంట గ్రామం మల్లమ్మ గుడి, ఎస్సీ కాలనీ, రజక వృత్తిదారుల వీధిలో సిపిఎం నాయకులు పర్యటించి ప్రజాసమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు కృష్ణ, ప్రాంతీయ కమిటీ సభ్యులు మైనా మాట్లాడారు. మండలంలో అత్యధిక జనాభా గలిగిన రెండో అతిపెద్ద గ్రామం చింతకుంట అని, గ్రామంలో సిసి రోడ్డు లేకపోవడంతో రోడ్లు మొత్తం అస్తవ్యస్తంగా తయారయ్యాయని తెలిపారు. ప్రతి ఇంటి ముందు రోడ్డు మురుగుమయమైందని చెప్పారు. కొన్నిచోట్ల సిసి రోడ్లు వేసినా, డ్రైయినేజీ కాలువలు లేకపోవడంతో సిసి రోడ్లపైనే మురుగునీరు వెళ్తున్నాయని తెలిపారు. మల్లమ్మ గుడి సమీపంలోని సిసి రోడ్డు శ్మశాన వాటిక వరకు పూర్తి చేయకుండా మధ్యలోనే ఆపేశారని చెప్పారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 258 మంది విద్యార్థులకు ఇద్దరే ఉపాధ్యాయులు ఉన్నారని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే పరిస్థితి లేదని తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు నాగరాజు, మురుగన్, శివ, హేమాద్రి, గోవిందు, ఉలిగప్ప, చంద్ర పాల్గొన్నారు.


హాలహర్విలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


తడిసిన మిరప పంట

అకాల వర్షం..!

- నీట తడిసిన మిరప పంట - ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - చిప్పగిరి

రైతులకు ఏదో ఒక రూపంలో నష్టాలు సంభవిస్తూనే ఉన్నాయి. ధరలు లేక చెట్టు నుంచి తెంపుకున్న మిరపకాయలను ఇంటికి తీసుకు రాకుండా రైతులు పొలాల్లోనే నిల్వ ఉంచారు. ఆదివారం రాత్రి ఏరూరు, దేగలపాడు, గుమ్మనూరు, దౌల్తాపురం గ్రామాల్లో వర్షం కురిసింది. అకాలవర్షంతో మిరపకాయలు తడిచాయి. ధరలు లేక రైతులు ఆవేదన చెందుతుంటే మరోవైపు ఈ అకాల వర్షాలకు మిరపకాయలు తడిచాయి. మిరపకాయలు రంగు లేదా బూజుపడతాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. మిరప సాగు చేసిన రైతులందరూ రూ.లక్షలకు లక్షలు పెట్టుబడులు పెట్టారు. ధరలు లేక అప్పులకు వడ్డీలు ఎక్కువ అవుతుంటే రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ సమస్యకు తోడు అకాల వర్షం వచ్చి మరో నష్టం మిగిల్చిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

'పద్మశాలి' ఉపాధ్యక్షులుగా నవీన్ కుమార్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



పద్మశాలి యువజన సంఘం ఎమ్మిగనూరు ఉపాధ్యక్షులుగా ఆడిమి నవీన్ కుమార్ ఎంపికయ్యారు. సోమవారం పద్మశాలి కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా ఎంపికైన ఆడిమి నవీన్ కుమార్ ప్రమాణస్వీకారం చేశారు.

మహారాజ శ్రీ జూనియర్ సివిల్ జడ్జి
(జూనియర్ డివిజన్) ఆలూరు
ఓ.ఎస్.నెం.153/2023

Betwenn :-
జగన్ మోహన్ రెడ్డి. ...వాది
V/s
ఎన్.లక్ష్మీకాంత రెడ్డి. ...ప్రతివాది
టు,
ఎన్.లక్ష్మీకాంత రెడ్డి, తండ్రి సోమశేఖర్ రెడ్డి,
R/o H.No.2/186, నగరడోణ (గ్రామం),
చిప్పగిరి (మం), కర్నూలు జిల్లా

నోటీస్ (Notice)

పై దావా నందు వాది అప్పురాబట్టు కొనుటకు గాను కోర్టు వారు నోటీసు పంపి ఉన్నారు. పై దావా నందు నీకు నోటీసు చేరనందున ఈ ప్రకటన ద్వారా తెల్పడమైనది. కావున మీరు గాని మీ తరపున వకీలు గాని హాజరై ఏదైన అభ్యంతరములు ఉంటే తేది:28.03.2025 ఉదయం 10.30 ని॥లకు హాజరై తెలుపు కొనవలెను. లేని యెడల పరోక్షమున కోర్టు వారు తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా తేది : 28.03.2025

బి.తిమ్మయ్య,
ఆర్.వి.యుగంధర్,
అడ్వకేట్, ఆలూరు.

In the court of gthe IVth Additional Junior civil Judge : Kurnool
I.A.No.639/2023 in O.S.No.420/2021

K.Siva Parvatha Reddy. ...Petitioner/Plaintiff
Verses
V.Giridhar Yadav. ...Repondent/Defendent

Notice to Respondent/Defendent

V.Giridhar Yadav
S/o G.P.Maddilety,
Classic catagary No-13,
Kaadambari township,
B.Thandrapadu Village,
Kurnool Mandal & Distric.

అర్జిదారుడు తన దావా మొత్తము రాబట్టు కొనుటకు ప్రతివాది అయిన నీ మీద సదరు దావాను దాకలు చేయడము అయినది. సదరు దావా 4/8/2023వ తేదినాడు డిస్మిస్ అయినది. సదరు దావా పునరుద్దరణకోసము నీకు కోర్టు వారు నోటీసు జారీ చేయడము చేయడము అయినది. పై సదరు కేసునందు నీ హాజరుకై 28.03.2025వ తేదిన వాయిదా కలదు. అ దినము నీవు స్వయంగా కానీ, నీ తరపు న్యావాది గానీ ఉదయం 10.30 గంటలకు హాజరై తెలుపవలయును లేని యెడల మీ పరోక్షమున కేసు విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడము అయినది.

వాయిదా తేది: 28-03-2025

సి.నాగమల్లేశ్వరి
అర్జిదారు పరం న్యాయవాది,
కర్నూలు.
సెల్: 9440655944

మహారాజశ్రీ గౌరవనీయులైన సివిల్ జడ్జి కోర్టు
(సీనియర్ డివిజన్) ఆదోని
I.P. No.05/2016

Between:
1. కైరవాడి అబు బక్కర్ (Died by L.Rs.,)
2. కైరవాడి నూర్జహన్,
W/o లేట్ కైరవాడి అబు బక్కర్
3. షేక్ హసీనా D/o లేట్ కె. అబు బక్కర్
4. కైరవాడి మహమ్మద్ హుసైన్
S/O లేట్ కైరవాడి అబు బక్కర్
5. కైరవాడి మహమ్మద్ ఖాసీమ్
S/o లేట్ కైరవాడి అబు బక్కర్
All are R/o ఇంటి నెం. 9/31-1, ముగతిపేట, ఎమ్మిగనూరు టౌన్, కర్నూలు జిల్లా. ...పిటీషనర్స్
V/s
1. E.రామ్మోహన్ శెట్టి S/o E.హనుమంతయ్య శెట్టి
R/o ఇంటి నెం.18/205, గోనెగొండ్ల రోడ్, ఎమ్మిగనూర్ టౌన్.
2. గొల్ల లక్ష్మీదేవి W/o లేట్ గొల్ల గోవిందరాజు,
R/O , ఇంటి నెం. 5/479-1,
M.S.నగర్, ఎమ్మిగనూర్ టౌన్. ...రెస్పాండెంట్స్

జనరల్ నోటీస్ టు పబ్లిక్

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా పైన తెలిపిన పిటిషనర్స్ అయిన లేట్ కైరవాడి అబు బక్కర్ గారు మరియు అతని వారసులు గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్, ఆదోనిలో పైన కనపరచిన రెస్పాండెంట్పై దివాలా దావా దాఖలు చేసియున్నారు. కావున ఎవరికైనా ఇందుపైకి ఆక్షేపణలు గాని మరియు అభ్యంతరములుగాని వున్న యెడల తేది: 09-05-2025 ఉదయం 10.30 గంటలకు పై కోర్టు ముందు స్వయంగా గాని వకీలు ద్వారా గాని కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపవచ్చును, ఎవ్వరూ హాజరు కాని యెడల పై కోర్టు వారు కేసును పిటిషనర్స్/దివాలాదారుల పరముగా తీర్మానింపబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేదీ : 09-05-2025

శ్రీ డి. చంద్రయ్య,
పిటీషనర్ల తరపు అడ్వోకేట్,
ఆదోని-518301.
మొబైల్ నెం. 9908066207

20 ఏళ్లుగా ఇంటి స్థలం లేక ఇబ్బందులు

- బాధితురాలు ముల్లా మహబూబ్ బీ

ప్రజాశక్తి - మంత్రాలయం

గత 20 ఏళ్లుగా ఇంటి స్థలం లేక ఇంటి బాడుగలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నానని ముల్లా మహబూబ్ బీ తెలిపారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో సమస్యల పరిష్కార వేదిక ద్వారా తహశీల్దార్ ఎస్.రవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గత 20 ఏళ్లుగా స్థానికంగా కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నానని, తనకు భర్త, ముగ్గురు కుమారులు ఉన్నారని తెలిపారు. భర్త మద్యానికి బానిసయ్యాడని, ముగ్గురు పిల్లలతో వచ్చిన కూలీ డబ్బులతో కుటుంబాన్ని ఈడ్చుకుంటూ వస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇవ్వలేదని వాపోయారు. అధికారులు స్పందించి ఇంటి స్థలం కేటాయించి ప్రభుత్వం ద్వారా గృహ నిర్మాణం చేపట్టి ఇవ్వాలని కోరారు.

మెడికల్ కళాశాల పనులపై నిర్లక్ష్యం వద్దు

- నాబార్డ్ జిఎం ప్రసాద్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మండలం బైచిగేరి సమీపంలో నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల పనులను నిర్లక్ష్యం చేయకుండా త్వరగా పూర్తిచేయాలని నాబార్డ్ రాష్ట్ర జనరల్ మేనేజర్ కెవిఎస్.ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్ఐడిఎఫ్ నిధుల కింద మెడికల్ కళాశాల నిర్మాణానికి రూ.312 కోట్లు మంజూరు చేసిందన్నారు. కొన్ని కారణాలవల్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని తెలిపారు. ఇప్పటివరకు 60 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను త్వరగా పూర్తి చేసి వినియోగంలో తీసుకురావాలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సుబ్బారెడ్డి, ఇంజినీర్ కన్సిడర్ కేశవయ్య ఉన్నారు.


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ప్రసాద్

నిరుద్యోగ భృతి రూ.3 వేలివ్వాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు వెంటనే ఇవ్వాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ వర్ధంతి వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని శివన్న నగర్‌లో వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు మహేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడారు. భగత్ సింగ్, రాజు గురు, సుఖీదేవ్ స్ఫూర్తితో యువత పనిచేయాలని కోరారు. గత ఎన్నికల్లో ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు రూ.3 వేల భృతి ఇస్తామని హామీఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చి పది నెలలైనా నెరవేర్చలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన మొదటి సంతకం డీఎస్సీపై పెట్టారని, అది కాగితాలకే పరిమితమైందని తెలిపారు. డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని, రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని, జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. డివైఎఫ్ఐ నాయకులు రవి, ఉదయ్ కిరణ్, రాము, కల్యాణ్, వీరేష్, నూతన్ పాల్గొన్నారు. **పెద్దకడబూరు** ఆర్‌టిసి బస్టాండ్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. వ్యకాస నాయకులు తిక్కన్న, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి దేవదాసు, సిఐటియు నాయకులు ఈరన్న భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


ఎమ్మిగనూరులో నివాళులర్పిస్తున్న యువత

శభాష్ పోలీస్..!

ప్రజాశక్తి-ఆదోనిరూరల్


యువకునికి ఫస్ట్ ఎయిడ్ చేస్తున్న పోలీసులు

మానవ సేవే...మాధవ సేవ.. అని పోలీసులు నిరూపించారు. నిత్యం విధుల్లో బిజీగా ఉండే పోలీసులు మేము సైతం అన్నట్లు సామాజిక స్పృహను గుర్తెరిగారు. సోమవారం పట్టణంలోని బబ్బులమ్మ గుడి దగ్గర టీ తాగుతున్నప్పుడు అకస్మాత్తుగా ఒక అబ్బాయి ఫిట్స్ వచ్చి క్రిటికల్ పొజిషన్‌లో ఉన్నాడు. అప్పుడు 1వ పట్టణ పోలీసు స్టేషన్ కానిస్టేబుళ్లు మధుసూదన్, మునిచంద్ర వస్తూ వస్తూనే ఆ పిల్లోడికి సహాయం చేసి ఫస్ట్ ఎయిడ్ అందించారు. ఆ పిల్లాడి ప్రాణాలు కాపాడారు. యువకుని పట్ల మానవత్వం ప్రదర్శించిన పోలీసులను చూసి శభాష్ అంటూ పలువురు అభినందించారు.

తాగునీటి శుద్ధి కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని జాలిమంచి గ్రామంలో అల్టీయస్, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాగునీటి శుద్ధి కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ జనరల్ మేనేజర్ జూపల్లి పురుషోత్తం రావు మాట్లాడారు. ప్రజలు కలుషిత నీరు తాగి అనారోగ్యం పాలు కాకుండా శుద్ధి చేసిన సురక్షితమైన నీరు తాగాలని తెలిపారు. ప్రజలు ఇళ్ల ముందు నీరు నిల్వ ఉండకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అల్టీయస్ రాయలసీమ మేనేజర్ లక్ష్మికాంత్ మాట్లాడుతూ... గ్రామీణ ప్రజల ఆరోగ్యం బాగుండాలని తమలాంటి సంస్థలు కృషి చేస్తున్నాయని తెలిపారు. సర్పంచి తిక్కమ్మ, గోవిందు, ఎంపిటిసి సరోజమ్మ, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్ రావు, అల్టీయస్ ప్రతినిధులు మహేష్, రాములు, నవీన్ పాల్గొన్నారు.


తాగునీటి శుద్ధి కేంద్రం ప్రారంభిస్తున్న సభ్యులు

'ఉపాధి' పూడికతీత పనులపై విచారణ

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని నాలుగు గ్రామాల్లో గతంలో ఉపాధి హామీ చట్టంలో భాగంగా నిర్వహించిన పూడికతీత పనులపై సోమవారం విచారణ చేపట్టినట్లు ఏపిడీ అలీ పీరన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. 2023-24 సంవత్సరంలో మండలంలోని గంజిహళ్లి, కులుమాల, వెముగోడు, నేరడుప్పల గ్రామాల్లో ఉపాధి కింద పంట కాలువల పూడికతీత పనులు నిర్వహించినట్లు తెలిపారు. గత కొద్ది నెలల క్రితం నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో ఈ పనులను తిరిగి పరిశీలించి విచారించాలని డ్వామా పీడీ ఆదేశాల మేరకు పనులను పరిశీలించి విచారించామన్నారు. ఈసీ ఉస్మాన్ పాల్గొన్నారు.

'అసంబద్ధ బిల్లును వ్యతిరేకించాలి'

ప్రజాశక్తి - ఆదోని

వక్ఫ్‌బోర్డ్ అసంబద్ధ బిల్లును ముఖ్యమంత్రులు చంద్రబాబు, నితీష్ కుమార్ వ్యతిరేకించాలని ఆదోని ముస్లిం జెఎసి నాయకులు కోరారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన చేపట్టి, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ముస్లిం జెఎసి అధ్యక్షులు, ఎంహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్, ముస్లిం మతపెద్ద ఖాలిద్ నిజామి మాట్లాడారు. దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసే విధంగా ఉన్న వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును పార్లమెంట్‌లో వ్యతిరేకించాలని కోరారు. ఈ బిల్లుతో ముస్లిం ధార్మిక సంస్థల స్థలాలను లాక్కొని బిజెపి ప్రభుత్వం బడా బాబులకు కట్టబెట్టాలని కుట్ర చేస్తోందని విమర్శించారు. ఈ బిల్లును ఆపగలిగే శక్తి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌కు ఉందన్నారు. ముస్లిం జెఎసి కో కన్వీనర్, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ నూర్, ముస్లిం మత పెద్దలు ఖలీఫా, జుమ్మా మసీదు ఖతీబ్ జునైద్ హాష్మి, రెండో ఖాజీ తాహెర్ మిస్బాహీ, సయ్యద్ నవాజ్ సాహెబ్, న్యాయవాదులు సద్దాం, వసీమ్, ఎస్‌డిపిఐ ఆదోని కోకన్వీనర్ సద్దాం, మానవ హక్కుల సంఘం నాయకులు ఖాదర్, జెఎసి నాయకులు ఫరూక్, ఇర్షాద్, గౌస్ ఖాన్, నాసిర్, సోషల్ వర్కర్లు మన్సూర్ టీం, నూర్, వైసిపి కౌన్సిలర్ హాజీ, నాయకులు అబుబాకర్, యాసీన్, బీఎస్పీ ఆదోని అధ్యక్షులు ఫయాజ్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు


మద్దతు తెలుపుతున్న వైసిపి నాయకులు

ఆర్‌డిఎస్ కుడికాలువ నిర్మాణం తప్పనిసరి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఆర్‌డిఎస్ కుడి కాలువ నిర్మాణం తప్పనిసరి అని వైసిపి పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప, మున్సిపల్ వైస్ ఛైర్మన్ డి.నజీర్ అహ్మద్, చేనేత జిల్లా అధ్యక్షులు ఎంకె.శివ ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని సోమప్ప సర్కిల్ వద్ద ఆర్‌డిఎస్ కుడికాలువ సాధన సమితి ఆధ్వర్యంలో సాగుతున్న రిలే నిరాహార దీక్షలకు సోమవారం వైసిపి నాయకులు మద్దతు తెలిపారు. వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక ఆదేశాల మేరకు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆర్‌డిఎస్ కుడికాలువ నిర్మాణం లేకపోవడంతో ఎమ్మిగనూరు, మంత్రాలయం వంటి నియోజకవర్గాల్లో సాగునీటి సమస్య ఉందని తెలిపారు. గతంలో వైఎస్ఆర్ హయాంలో రాయలసీమకు ప్రాధాన్యత ఇచ్చి పోతిరెడ్డిపాడు, హంద్రీనీవా, గండికోట, గాలేరునగరి లాంటి ప్రాజెక్టులను పూర్తి చేశారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు.

దీక్షకు కులం రంగు

- ఛైర్మన్‌కు శాంతకు వాల్మీకి నాయకుల మద్దతు

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపల్ ఛైర్మన్ శాంత చేపట్టిన దీక్ష శిబిరానికి కులం రంగు పులుముకుందని విమర్శలు వస్తున్నాయి. ఛైర్మన్ శాంత చేపట్టిన దీక్షకు ప్రజల నుంచి అనుకున్న స్థాయిలో మద్దతు రాలేదని పలువురు పేర్కొంటున్నారు. శిబిరం వెనుక ఎమ్మెల్యే పార్థసారథి హస్తం ఉందని వైసిపి నాయకులు ముందు నుంచి విమర్శిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో వాల్మీకి సంఘం నాయకులు ఆమె దీక్ష శిబిరానికి ఆది, సోమవారాల్లో సంఘీభావం తెలిపారు. వారు కూడా బిజెపి నాయకులు, వైసిపి నుంచి బిజెపిలో చేరిన వారే ఉన్నారని వైసిపి నాయకులు విమర్శలు చేస్తున్నారు.

ఉత్తమ సూపర్‌వైజర్‌గా అవార్డు

ప్రజాశక్తి - ఆదోని

టిబి వ్యాధిని అరికట్టడంలో, రోగులతో పోషకాహార కిట్లు ఇప్పించడంలో బాబురాజు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. తరచూ హెల్త్ సిబ్బంది సహకారంతో క్షేత్రస్థాయిలో టిబి నివారణ చర్యల గురించి ప్రజలకు వివరిస్తున్నారు. ఆదోని టిబి విభాగంలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బాబు రాజు సేవలను అధికారులు గుర్తించారు. అంతర్జాతీయ టిబి దినోత్సవం సందర్భంగా కర్నూలు ప్రభుత్వాస్పత్రి ఆడిటోరియంలో టిబి డేలో ఉత్తమ సూపర్‌వైజర్‌గా బాబు రాజు అవార్డు అందుకున్నారు. జిల్లా టిబి నివారణాధికారి భాస్కర్, మాజీ ఆఫీసర్ మోక్షేశ్వరయ్య చేతుల మీదుగా అవార్డు పొందారు. అలాగే ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్‌గా పద్మావతి అవార్డు తీసుకున్నారు. సోమవారం వారిని పలువురు అభినందించారు.